క్లుప్తంగా...

10న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

జవహర్‌నగర్: ఈ నెల 10న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు స్టాన్లీ జోన్స్, కె.రాజశేఖర్ తెలిపారు. అండర్–14, 16, 18, 20 బాలబాలికలకు రన్నింగ్, జంపింగ్ త్రోయింగ్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. శామీర్‌పేటలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో ఈ నెల 10న ఉదయం 7 గంటలలోపు రావాలని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఈ నెల 30న కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫోన్: 98496 12733.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన ఆశు ఆజం గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి(నాని) ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేల నగదు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగార్జునరెడ్డి, షేక్ ఆఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



మేడ్చల్‌రూరల్: రాష్ట్ర మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో మంత్రి మల్లారెడ్డితో కలిసి మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. మంత్రి మహేందర్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణలు తదితరులు ఉన్నారు.

బర్మాజీగూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీ

మేడ్చల్: మండలంలోని లింగాపూర్ అనుబంధ గ్రామం బర్మాజీగూడలో మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ లక్ష్మీ సంజీవయ్య ప్రారంభించారు. గ్రామంలో నిర్మాణ పనులను సర్పంచ్ లక్ష్మీ సంజీవయ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. గ్రామంలో మొత్తం సీసీ రోడ్లు నిర్మించడానికి మంత్రి మల్లారెడ్డి సొంత నిధులు మంజూరు చేశారని, ఆయన చొరవతో పూర్తిగా నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, భూలక్ష్మీ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కాంగ్రెస్ జోడో యాత్ర



మేడ్చల్: రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు జోడో యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, జైపాల్‌రెడ్డి, రవిముదిరాజ్, వైఎస్‌గౌడ్, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు సురేందర్‌ముదిరాజ్, గోపాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, నియోకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆనా.. జానా.. నై

వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటన చేస్తే చాలు పలు గ్రామాల ప్రజలకు ఆందోళన తప్పడం లేదు. గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా.. ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి చేరుకోవాలన్నా త్వరగా వెళ్లాల్సిందే.. ఒకవేళ భారీ వర్షం పడితే రోడ్లు బంద్ అవడం అవడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. గమ్యస్థానానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి. లేదంటే వరద నీరు వెళ్లేంత వరకు గంటల తరబడి లో లెవల్ బ్రిడ్జిల వద్ద ఎదురుచూడాల్సిందే..

మేడ్చల్: మండలంలో ఒక్కరోజు భారీ వర్షం కురిసినా చాలు రెండు రోజుల పాటు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు ఉండటంతో ఆ గ్రామస్తులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రధాన రోడ్లలో పురాతన కాలం నాటి లో లెవల్ బ్రిడ్జిలు ఉండటంతో వాగులు పొంగుతూ రోడ్లపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ రోడ్ల మీదుగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. వర్షాలు పడితే మేడ్చల్– గౌడవెల్లి, మేడ్చల్–కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రూట్లు, లింగాపూర్ డబీల్‌పూర్, నూతన్‌కల్ –మేడ్చల్ రూట్లో లోలెవల్ బ్రిడ్జిలు ఉండటంతో బ్రిడ్జిల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడుతుంది.

రాకపోకలు బంద్

మండలంలోని గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రూట్లో రాయిలాపూర్ శివార్లలో, మేడ్చల్ కిష్టాపూర్ రూట్లో మేడ్చల్ శివారులో, లింగాపూర్ గ్రామం వద్ద, నూతన్‌కల్ వద్ద బండమాదారం రూట్లో గ్రామ శివారు వద్ద, రావల్‌కోల్ –మేడ్చల్ రూట్లో, రావల్‌కోల్–మేడ్చల్ వయా జయదర్శిని రూట్లో కల్వర్టుల పైనుంచి వరద నీరు పారుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మేడ్చల్–గిర్మాపూర్ రూట్లో వరద నీరు వెళ్లే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద నుంచి రోడ్లు వేయడంతో చెరువులు పొంగినా, జోరుగా వర్షాలు కురిసినా వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈ రూట్లలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.



మేడ్చల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద..

శాశ్వత మరమ్మతులు చేయాలి



వర్షం కురిసిన ప్రతిసారీ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బండమాదారం, శ్రీరంగవరం, రాయిలాపూర్, గిర్మాపూర్, మేడ్చల్‌లో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు వర్షం పడిన సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. శాశ్వతంగా పరిష్కారం చూపాలి. కల్వర్టులను తొలగించి బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి.

– కృష్ణ, బండమాదారం

ఎన్నాళ్లు ఇబ్బందులు పడాలి



మేడ్చల్ మున్సిపాలిటీలో ఒక కాలనీ నుంచి మరో కాలనీకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. మేడ్చల్ రైల్వే బ్రిడ్జి, కిష్టాపూర్ వంతెనల వద్ద వరద నీరు పొంగి పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనాలు, బైకులు, నడిచి వెళ్లలేకపోతున్నాం. ప్రజలు ఎన్నాళ్లు ఈ కష్టాలు అనుభవించాలి. ఇప్పటికైనా పాలకులు స్పందించాలి.


– రాఘవరెడ్డి, గిర్మాపూర్



గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రూట్లో రాయిలాపూర్ శివారులో..

పొలాలు తగ్గి.. ప్లాట్లు పెరిగి..

మేడ్చల్ మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో రియల్ దందా జోరుగా ఉండటంతో పొలాలు తగ్గి ప్లాట్లు ఎక్కువయ్యాయి. దీంతో చెరువుల కింద ఆయకట్టు పూర్తిగా తగ్గిపోయింది. దాదాపు అన్ని గొలుసు కట్టు చెరువులు, కుంటలు కావడం, రెండు మూడెళ్ల నుంచి అన్నీ నీటితో నిండి ఉండటంతో చిన్నపాటి వర్షానికే పొంగి పారుతున్నాయి. భవిష్యత్‌లో కూడా ఇలాగే ఉండే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా రోడ్లు దెబ్బతింటున్నాయి.



బండమాదారం రూట్లో..

జీవో 59 పేరుతో పేదల ఇళ్లు కూలుస్తారా?

- బీఆర్‌ఎస్ పాలనలో ఇంత దుర్మార్గమా..
- ప్రభుత్వ ఖజానా నింపేందుకు పేదల ఇళ్లే టార్గెట్‌గా..
- 20 ఏళ్ల క్రితం కట్టుకున్న పేదల ఇళ్లపై సర్కార్ జులూం
- డబ్బులు కట్టించాలని తహసీల్దార్‌పై ప్రభుత్వం ఒత్తిడి
- జీవో– 59 పేరుతో ప్రభుత్వ దందాను నిలిపివేయాలి
- కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: జీవో–59 పేరుతో 20 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను కూల్చడం బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో జీవో–59 పేరుతో జవహర్‌నగర్‌లో రూ.9 కోట్లు వసూలు చేసి వాటిని క్రమబద్ధీకరించకుండా ఆ డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేసిందన్నారు. మళ్లీ జీవో–59 పేరుతో తాజాగా లక్షల రూపాయలు డిమాండ్ నోటీసులు పంపి మీరు కడతారా లేదంటే కూల్చివేస్తామని జేసీబీతో వచ్చి రెవెన్యూ అధికారులు బెదిరించడం ఎంతవరకు సమంజసం అన్నారు. గతంలో కట్టిన డీడీలను పట్టించుకోకుండా తాజాగా కోకాపేటలో ఉన్న ధర ప్రకారం రుసుం చెల్లించాలని హుకూం జారీ చేయడంపై మండిపడ్డారు. ఇప్పటి వరకు జవహర్‌నగర్‌లో మంత్రి మల్లారెడ్డి అక్రమంగా నిర్మించిన ఆసుపత్రికి ఎన్ని లక్షల రూపాయలు జీవో–59 పేరుతో అధికారులు వసూలు చేశారో తెలియజేయాలన్నారు. పేదలు ఖచ్చితంగా డబ్బులు కట్టాలని మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు బెదిరిస్తున్నారని, అసలు వారు నిర్మించిన అక్రమ నిర్మాణాలకు ఎన్ని డబ్బులు చెల్లించారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. జీవో–59 పేరుతో పేదల జోలికి వస్తే సహించేది లేదని, ప్రభుత్వ నియంత పాలన ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని రాబోయో రోజుల్లో బీఆర్‌ఎస్ పాలనకు చమరగీతం పాడతారని హెచ్చరించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పేదలను డబ్బుల పేరుతో బెదిరిస్తే కాంగ్రెస్ పార్టీ సహించే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఖజానా నింపడానికి జీవో–59 పేరుతో అధికారులకు టార్గెట్లు ఇచ్చి జీసీ పీలతో పేదలను బెదిరింపులకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్ల వినయ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లత, సుగుణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా నాగారంను తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



8వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సుమారు రూ.9 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డును స్థానిక కౌన్సిలర్ కౌకుట్ల మమతకృష్ణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ కౌకుట్ల మమత కృష్ణారెడ్డి, కొముర్లెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, నేతలు బాలరాజు, శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి, రమణారెడ్డి, కాల నీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కీసర: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ రూరల్ యూత్ ప్రధాన కార్యదర్శిగా కీసర గ్రామానికి చెందిన బొడుసు సాయికుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మంత్రి మల్లారెడ్డి బొడుసు సాయికుమార్ యాదవ్‌కు శాలువా కప్పి అభినందించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెద్దఎత్తున యువతకు తెలియజేస్తూ రానున్న ఎన్నికల్లో యువత బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ రూరల్ అధ్యక్షుడు నీరజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్, నేతలు నాయకపు వెంకటేష్‌ముదిరాజ్, బెలిదే రమేష్‌గుప్తా, కందాడి శ్రీకాంత్‌రెడ్డి, మచ్చాని జంగయ్యయాదవ్, తటాకం లక్ష్మణ్, బొడుసు రమేష్‌యాదవ్, భానుచందర్, గుర్రం శ్రీధర్ రెడ్డి, తుడుం శ్రీనివాస్, పుట్ట రాజు, మొర్గు రవీందర్, జూపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సాయికుమార్‌యాదవ్‌ను అభినందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

శ్రీవిశ్వకర్మ యజ్ఞమహోత్సవానికి ఆహ్వానం



మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం అందిస్తున్న నాయకులు

మేడిపల్లి: కులవృత్తి సంఘాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందేవిధంగా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నోజు కృష్ణాచారి అన్నారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలను పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మంత్రి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈనెల 17న జరగనున్న శ్రీవిశ్వకర్మ యజ్ఞమహోత్సవానికి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు, గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం రాజుయాదవ్, నాయకులు కాట పాక కుమార్, భరత్, సునీల్, సత్యనారాయణగౌడ్, భార్గవి, భారతి, శ్రీనివాస్‌చారి, పుల్లయ్యాచారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మెడోస్ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: తిరుమల మెడోస్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇల్లూరి శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా గుండాల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.స్వప్నరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.శేఖర్‌రాజు, ఉప ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి ఇంద్రాణి, కోశాధికారిగా టి.స్వప్నరెడ్డి, ఉప కోశాధికారిగా శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అంకం హరి ప్రసాద్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.విజయలక్ష్మి, కార్యనిర్వాహక సభ్యులుగా విజయలక్ష్మి, కుమార్, వెంకట్‌రెడ్డి, మధు, శ్రీనివాస్, జగదీశ్, సదర్‌లాల్, శ్రీధర్‌రెడ్డి, సందీప్ ఎన్నికయ్యారు.

అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్

అల్వాల్: దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల ఆశయాలను కొనసాగిద్దామని బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్(టీ సాయి) అన్నారు. గురువారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హనుమాన్ టెకిడిలో ఆయన మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకోవడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డి.వెంకటేష్, అజయ్‌రెడ్డి, ఉదయ్ ప్రకాష్, సుజాత, మల్లికార్జున్‌గౌడ్, మల్లికార్జున్ యాదవ్, మల్లేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర మట్టి సేకరణ...

రామంతాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరా మట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రామంతాపూర్ నల్లపోచమ్మ దేవాలయం వద్ద మట్టిని సేకరించారు. మేరా దేశ్ – మేరా మట్టి అసెంబ్లీ కో ఆర్డినేటర్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరావు, సురేఖ, కృష్ణగౌడ్, కొత్తపల్లి రమేష్, సో మ శ్రీనివాస్, అరవింద్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారంలో మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

దశలవారీగా మౌలిక వసతుల కల్పన




డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 19వ డివిజన్‌లోని వెస్ట్ హనుమాన్‌నగర్ కాలనీ, కేశవనగర్ కాలనీల్లో రూ.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెస్ట్ హనుమాన్‌నగర్‌లో చాలాకాలంగా డ్రైనేజీ సమస్య ఉందని, దానికి శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. 19 డివిజన్‌లో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో డివిజన్‌లో మిగిలిపోయిన సమస్యలకు పూర్తిగా పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమే..

- వైరల్ అవుతున్న మ్యాన్‌హోల్ తెరిచిన వీడియోలు
- కాలనీ ప్రెసిడెంట్, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశాం: బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సుమన్
- ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నాం



సీసీ ఫుటేజీలో లభ్యమైన మ్యాన్‌హోల్ మూత తెరుస్తున్న దృశ్యాలు..

నిజాంపేట్: చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ఉంది నిజాంపేట్ కార్పొరేషన్ అధికారుల పనితీరు. మంగళవారం ప్రగతినగర్‌లోని ఎన్‌ఆర్‌ఐ కాలనీలో మ్యాన్‌హోల్‌లో జారిపడి నాలాలో కొట్టుకుపోయి బాలుడు మిథున్‌రెడ్డి (4) మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు ఆగమేఘాల మీద సమీపంలో మ్యాన్‌హోళ్ల మూతలను సరిచేయడంతో పాటు బాలుడు జారిపడిన అపార్ట్‌మెంట్ సమీపంలోని నాలాను ఆనుకుని కంచెను ఏర్పాటు చేశారు. అయితే ప్రగతినగర్ ఎన్‌ఆర్‌ఐ కాలనీ నుంచి నిజాంపేట్‌లోని తుర్క చెరువు వరకు ఉన్న నాలా ప్రమాదకరంగా ఉంది. ఎటువంటి రక్షణ కంచె లేకపోవడంతో పాటు పలు చోట్ల నాలాపై శ్లాబ్‌లు లేకపోవడం.. ఓపెన్ నాలాగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందే నాలా ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లతో పాటు మ్యాన్‌హోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నట్లయితే బాలుడి ప్రాణాలు పోయేవి కాదని పలువురు పెదవి విరుస్తున్నారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రగతినగర్ స్పాటిలా గార్డెనియా అపార్ట్‌మెంట్ సమీపంలో వరదనీరు వెళ్లేందుకు మ్యాన్‌హోల్ మూత తెరుస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. వాట్సాస్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్‌లో ఈ వీడియోలు అప్‌లోడ్ కావడంతో సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మ్యాన్‌హోల్ పైకప్పు తెరిచిన వారిపై కేసు..

ప్రగతినగర్‌లోని స్పాటిలా గార్డెనియా అపార్ట్‌మెంట్ వద్ద మ్యాన్‌హోల్ మూత తెరిచి బాలుడు మృతికి కారణమైన కాలనీ ప్రెసిడెంట్, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సుమన్ కుమార్ తెలిపారు.



ఎన్‌ఆర్‌ఐ కాలనీ నుండి తుర్క చెరువు వెళ్లే ఓపెన్ నాలా..